గురజాడ 147వ జయంతి సందర్భంగా శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ.

# ఆశావహం

**కు**ళాయి దగ్గిరి గోలమాటలకి మెలకువ వచ్చింది. టైము అయిదన్నమాట. ఏంటో. స్వతంత్ర భారతి స్వర్ణోత్సవం జరుపుకున్నా తాగునీటి కోసం 'పానీ' పట్టు యుద్ధాలు తప్పడంలేదు....!

ఆ గొడవకేం గాని ఇవాళెలా గడవబోతోందో !

షరా మామూలే.

పరుగెత్తడం పనిచెయ్యడం తినడం నిట్టూర్చడం నిద్రపోవడం – యాంత్రిక జీవనం!

తెల్లారితే చాలు మళ్ళీ రోజు మొదలైందా అన్న దిగులు. ఎప్పుడు చీకటి పడుతుందా అని ఎదురుచూట్టం. పడకెక్కేక ఇక తెల్లారకుండా వుంటే బావుద్నన్న ఆశ. అయినా తెల్లారుతుంది. మళ్ళీ పరుగు పందెంలోకి...!

తప్పించుకోలేని ఇనుపచట్రం ! దేవుడూ ! నన్ను రక్షించు ఈ రసహీన జీవితం నుంచి !

తిలక్ కవిత్వం బావుంటుంది. తన అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన అమ్మాయిలట. ఎంత హృద్యంగా చెప్పేడు ! హేట్సాఫ్ !

అమ్మా.....యి ! మొదట తండ్రికీ తర్వాత భర్తకీ పిమ్మట పిల్లలకీ అమ్మ అయ్యే అపురూప మూర్తిత్వం ! ప్చ్... నా గీతల్లో జంట గీత వున్నట్టు లేదు. అసలు ఏ గీత తిన్నగా వుందనీ ! అన్నీ గజిబిజి గీతలు. పిచ్చి గీతలు. పద్మవ్యూహంలో చిక్కుకున్న అభినవ అభిమన్యుడ్ని!

బాపురే! టైం పరుగెడుతోంది. కాదు కాదు – నా చేతివేళ్ళ సందుల్లోంచి జారిపోతోంది – నా వయస్సులానే !

రెండంగల్లో బాత్‌రూంలోకి జంప్. మరి పది నిమిషాల్లో మొఖం కడిగి పారేసి... ఎంత కడిగినా తోమినా నల్లతోలు తెల్లబడదు.....టీవీలో చూపే అద్భుత క్రీమ్ వాడితే? పోనిద్దూ ఇప్పుడే కన్నెపిల్ల కన్ను గీటాల్లే! అవునూ. ముప్పైమూడు దాటి ముప్పై నాలుగులో అడుగుపెట్టి నాల్రోజులై పోయింది సుమా.

పుట్టిన్రోజులు చిన్నప్పుడే గుర్తుంటాయి. పెద్దయ్యాక దారి పొడవునా నిరాశలూ నిట్టూర్పులూ అని తెలిశాక.....!

కాఫీ నీళ్ళు మరిగాయి. కాఫీ వాసన ఆఘ్రాణిస్తూ సిప్‌చేస్తూ టీవీ ముఖంలోకి

తొంగి చూస్తూ మళ్ళీ సిప్ చేస్తూ ఆలోచనల్లో సింకవుతూ...

టె(ర్రరిస్టుల ఘాతుకాలు సీరియల్‌గా.....ఒకప్పుడు వేదభూమి పుణ్యభూమి శాంతి భూమి...ఇవాళ తుపాకుల పేలుళ్ళు! బాంబుల విస్ఫోటనాలు! కకావికలవుతోన్న మానవాంగాలు! భయం గుప్పిట్లో జనం! జనం గుండెల్లో అభద్రత! పావురాలెగిరిన చోట రక్తం ఏరులై పారుతోంది!

ఓ మహాత్మా! ఓ మహర్షీ! ఇదీ నువ్వు కనని కల! నేటి కఠిన వాస్తవం! బతుకు తీపి ఎరుగని తల్లి ప్రేమ పాలు తాగని వీర మతోన్మాదులు! తోటి మనిషి ప్రాణాలు హరించే హక్కు ఎవరిచ్చారో!

చోడో యార్. ఛానల్ మార్చా...భక్తి ఉపన్యాసాలు.....అన్నట్టు తెలుగునాట భక్తి రసం తెప్పలుగా పారుతోందన్న కవి చివరి దశలో భక్తుడిగా మారాడు కదూ? శక్తి తగ్గేక తనువు వంగేక, కన్పించని శక్తి కటాక్షం కోసం అలమటిస్తాడు మనిషి. వయస్సులో ట్రాష్ అన్పించింది వయస్సుడిగేక ట్రాప్ చేస్తుంది. ముందు గతి కానవే చిలకా....!

వణకుతూ స్నానించి ఇంటికి తాళం వేసి! ఇది ఇల్లా గూడా నిద్రపోయే ప్రదేశమా? వద్దొద్దు. తేనెతుట్ట కదిలించొద్దు...ఛలో...

యథాలాపంగా తలెత్తాను – అబద్ధం – అలవాటు ప్రకారమే చూశాను. నన్నే చూస్తున్న రెండు కళ్ళు దిశ మార్చుకున్నాయి. అయినా పెదాలు విడీవిడనట్టు నవ్వాయి. నా గుండెతో దోబూచులాడాయి......

ప్రకాషి నవ్వు ఎంత బావుంటుందో ! వెన్నెల కిరణం చిట్లినట్టు.....గుండె తంత్రులు ఝల్లుమని మ్రోగి తీరాల్సిందే...రవి వర్మ చూసుంటే మోనాలీసాని తలదన్నే చిత్రం ఊపిరి పోసుకునేది!

భాస్కర్ గాడు ఓ వెధవ. ఈ అపరంజి నవ్వునీ బతుకునీ 'స్వంతం చేసుకోరా' అన్నాను. ఇడియట్! నా కళ్ళకి ఉత్తమంగా కాదు ఉత్తగా కన్పిస్తోందనేశాడు చత్వారం గాడిద ! ఇంతింతలావు కళ్ళద్దాలూ వాడూనూ! అలా అని వూరుకున్నాడా? లేదు. అదోలా నవ్వుతూ 'నువ్వే చేసుకో వచ్చుగా!' అని కూశాడు!

వాడు నిజంగా ఫూల్. నేను ముందే ఆశపడిన సంగతి వాడి ఊహకి అందలేదు.

ఆమె నవ్వుతో బతుకు వెలిగించుకోవాలనెళ్ళానో రోజున. ఏడాది పరిచయంతో ఆమెకెలాంటి వరుడ్ని వెదుకుతున్నారంటూ ఆరా తీశాను. ప్రకాషి ఇంతింత కళ్ళతో చూసి లోపలి కెళ్ళి పోయింది. ఆమె తండ్రి పెద్ద నోరు తెరిచాడు.

"సాఫ్ట్‌వేర్ ఇంజినీరైతే బెటర్. ఇంకో జాబ్ అయినా ఓకే గాని శాలరీ థర్టీప్లస్ వుండాలి. అత్తమామల పోరు వుండ కూడదు. బాధ్యత లుండకూడదు. కారుంటే ఫైన్..."

లిస్టు పూర్తి కాలేదు గాని సగం తాగిన కాఫీ కప్పుని ఠపీమని పెట్టేసి పరుగునొచ్చేశాను. నా లోలోపలి ఆశ బయట పెట్టనందుకు నన్ను నేను అభినందించుకున్నాను. ఇరుగు

పొరుగు వాళ్ళం గనుక ఎదురైతే తొట్రుపాటు పడాల్సిన అగత్యం తప్పింది. ఏమైనా ఆకాశానికి నిచ్చెన్లు వేయాలను కోవడం.....!

ష్.....డ్రాపిట్. పుండు కెలకడం వేస్ట్. కాని..... ప్రకాషి ఎప్పటికీ నన్ను వూరించే స్వప్నం! వెంటాడే ఆశ!

"ఒరే ఏ లోకంలో వున్నావురా. పిలుస్తున్నా పలకవేంట్రా"

బొంగురు గొంతు శాల్తీ వంక చూశాను. పళ్లెం రాజు. అసలు పేరు పళ్లం రాజు. ఆర్టీవో ఆఫీసులో ఉద్యోగం. జేబునిండా నోట్లు, భార్య ఒంటినిండా బంగారం, ఇంట్లో వాళ్ళ పేర్ల మీద పొలాలూ స్తలాలూ!

భవిష్యత్తులో ఏసీబీ వాళ్ళు పట్టుకుంటే వాడు చెప్పే ఏకైక నిజం "నాకు ఎక్కడెక్కడ ఏయే ఆస్తులున్నాయో తెలీద్సార్"... అంతలా సంపాదించాడు. అది వాపు కాదు బలుపేనంటూ అడ్డంగా బలిసి మరీ చెబుతున్నాడు!

"ఇటొచ్చే వేంటి మావయ్యా"

"బ్యూటీ పార్లర్‌కి..."

"మనం డబ్బు మింగుతాం గాని అందం కొరుక్కు తినం కదా!"

"ఏంట్రోయ్ కూత పట్టేవ్. అందం కోసం కాదురా షేపుకోసం"

"అడ్డదిడ్డంగా పెరిగిన కంద పిలకల్ని షేపులోకి తెస్తారా వీళ్ళు?!"

"ఏదో చేస్తారట. పదిరోజుల్లో పదికేజీలు తగ్గిస్తామంటూ ముందు పదివేలు గుంజారు"

"వాళ్ళ బరువు పెరిగింది గనుక బాగా షేకు చేస్తార్లే"

"మసాజ్‌లూ ఆసనాలు కప్పు అన్నాలూ... అదో నరకంలే గాని నువ్విలా ఒంటికాయ సొంటి కొమ్ములా వుండి పాయావేంట్రా. పెళ్ళి చేసుకోవా?"

"మీ అమ్మాయినీ ఓ ఫ్లాట్‌నీ ఇవ్వకూడదూ లైఫ్‌లో సెటిలైపోతాను"

"ఓరి ఓరి! నాకే ఎసరు పెట్టావే. నువ్వు మారాలొరే. ఇప్పటికే గిడసబారి పోయావు. ఇంకా ముదిర్తే ఎవరూ పిల్లనివ్వరు. మనం ఎక్కడెలా తిరిగినా ఇంటిని కనిపెట్టుకునుండటానికీ, ఇంత వండి పడెయ్యడానికీ పెళ్లాం వుండాల్రా. సొల్లు కబుర్లు కట్టి పెట్టి అమ్మా నాన్నా చెప్పినట్టు విను. ఎవరొకర్ని కట్టేసుకో. వెళ్తానింక. ఎప్పుడైనా ఇంటికి రారా..."

ఆ 'ఎప్పుడు' ఎప్పుడూ రాదని మా ఇద్దరికీ తెలుసు. చంద్రుడు మనకి బాగా దగ్గర. ప్రక్క వీధి చాలా దూరం. అక్కడి బంధుమిత్రుల వంక తొంగి చూడం. ఏం లైఫ్ మనది !

కష్టం మీద కారెక్కి వెళ్ళిపోయాడు పళ్లెం రాజు. ఒకప్పుడు లెక్కల్లో మహా వీక్. ఇప్పుడు లెక్కల్లో మనిషైపోయాడు. వాళ్ళమ్మ అన్నట్టు సుడిగాడు!

నిరీక్షణ...బస్సుకోసం...బస్సనేవిటి ప్రతీదాని కోసం నిరీక్షిస్తూ క్రాస్‌రోడ్లో నేను!

చేతిలో డిగ్రీ. కంపెనీలో ఉద్యోగం. పదిహేను వేలు జీతం... కాని పెళ్ళి కాలేదు. వూహూ- అది సరైన మాట కాదు. స్పందింపజేసే యువతి తారస పళ్ళేదు. ఐ మీన్ నచ్చే సంబంధం రాలేదు. వచ్చిన వాళ్ళంతా గాజు పెంకులు. నాకు వజ్రం కావాలి. ఎప్పటికైనా దక్కుతుందో లేక పళ్లెంరాజన్నట్టు గిడస బారిపోతానో!

బాధగానే వుంది-తోడు లేదని, నీడ లేదని, అభిమానం ఆవేశం కలలు కన్నీళ్ళు పంచుకునే మనిషి లేదని! కానేం చెయ్యను? సర్దుకు పోలేను. సరిపెట్టుకోనూ లేను!

డబ్బు మూట బరువు చూసి పెళ్లాడమని పేరెంట్స్ పోరుతున్నారు. తైలం వుంటే కొండ మీది కోతి కూడా తైతక్కలాడుతుందిట. నిమిషానికి డబ్బై రెండుసార్లు టిక్కు టిక్కుమని కొట్టుకునే గుండె నాకక్కర్లేదు. నా కోసం వేనవేలసార్లు స్పందించే హృదయం కావాలి. నా మనస్సు వాకిట్లో ముత్యాల ముగ్గు అవ్వగల రమణి కావాలి. అలా అని చెబితే గ్రహించరు. నావన్నీ చిత్రమైన ఆలోచనలట. సగం గాలిలో, సగం కలల్లో తేలుతానట. ఐ కాంట్ హెల్ప్!

నిధి చాల సుఖమా అన్నాడు నాగార్జున రామదాసు. అదివో అల్లదివో శ్రీహరి వాసమూ అని పాడాడు. మళ్ళీ నాగార్జునే. శ్రీహరి వాసమంటే లక్ష్మీ నివాసమని...అంటే మనీ ప్రదేశమని వ్యాఖ్యానించుకుంటారు పిచ్చోళ్ళు.

డబ్బుకోసం ఆరాటాలు పోరాటాలు పరుగుళ్ళు వెదుకుళ్ళు మోసాయి ద్వేషాలు వేషాలు యుద్ధాలు...వద్దొద్దు ధన పురాణం!

మనకి అనుభూతులు కావాలి. రమ్య భావనలు కావాలి. గుండెల్ని తడిమే ఆప్యాయతలు కావాలి. కళ్ళు చెమర్చే ఆర్ధ్రత కావాలి. మనస్సు వీణను మీటే వేళ్ళు కావాలి. బతుకుని రాగాలతో నింపే అనురాగాలు కావాలి. ఆనందం ఆహ్లాదం కావాలి.

ఇదంతా చెబితే నన్నో పిచ్చోడిగా చూస్తున్నారు జనం! మా జనం!

జనం! ఎక్కడ చూసినా జన విస్ఫోటనం! పిల్లల్నికనే యంత్రాలు ఇండియన్ పేరెంట్స్. దేశ జనాభా నూట పదికోట్లు దాటిందనుకుంటా. దాటనీ రాజకీయులు సంతోషిస్తారు. ఓట్లు పెరుగుతాయిగా...!

చోడో యార్. పోలీట్రిక్స్ వద్దు. మరేది ముద్దు? ముద్దుల స్పెషలిస్టులు కమల హాసన్నో ఇమ్రాన్ హష్మీనో అడగాలి...

అదిగదిగో బస్సు. అందుకో పరుగు. కూడదీసుకో శక్తి. లేకుంటే మిస్సే! థాంక్ గాడ్ సీటు దొరికింది. సిటీ జనాభా అంతా ఎక్కేశారు. పూర్ణ గర్భిణిలా కదుల్తోంది...

"నొక్కెయ్యకండయ్యా ఊపిరాట్టం లేదూ..."

ఒక పెద్దాయన అరుపు. అటు చూశాను. చుట్టూతా జనం.

"కుమ్మకండయ్యా మీకు పుణ్యం వుంటుంది గానీ..." మళ్ళీ అరిచాడు.

"ముసలాయన మీద పడకండి. ఇటు జరగండి..." ఈ సారి నేను అరిచాను.

ట్రాఫిక్ ఎర్రలైటు. బస్సాగటం పాపం బిలబిలమంటూ దిగారో అరడజను మంది.

"నా పర్సు కొట్టేశారు!" ఏడుపు స్వరంతో ముసలాయన!

బాధ. జాలి. ప్చ్. ఫస్ట్ వీక్ ఇలాటి సీన్లు తప్పవు. పోలీసు కుక్కల్లా దొంగలు ఫాలో అవుతున్నారు. సమయం చూసి గ్రూపు దోపిడి. అసలిందుకే 64 కళల్లో చోర కళను చేర్చారేమో...!

గమ్యం వచ్చింది. నా గమ్యం కాదు, ఉద్యోగ ప్రదేశం. దిగి లోపలి కెళ్తూ పెద్ద గడియారపు ముఖారవిందం చూశాను. పదినిమిషాల ముందే వచ్చాను. నిట్టూర్చానో లేదో బాస్ పిలుపు. క్షణం వృథా చెయ్యనివ్వడు. సెకన్లు కూడా డబ్బే అంటాడు!

ఆర్డర్లు....తయారీ....సప్లై పరిస్థితి....ఇన్‌వాయిస్‌లు...రా మెటీరియల్స్...బాకీ వసూళ్ళు...బ్యాంక్ అప్పు గురించి నొక్కుళ్ళు...

బుర్ర వూపి వచ్చి పనిలోపడ్డాను. పని పని పని!

తేరుకునే సరికి రెండయ్యింది.

లంచ్‌తో బాటు కబుర్లు తింటూ... బాసు బొజ్జ తడిమి...అతడి మొదటి భార్యా పిల్లల మీద సానుభూతి కురిపించి...అరేబియా గుర్రం లాంటి రెండో పెళ్ళాన్ని తిట్టిపోసి...బాసు నిర్మిస్తోన్న భవంతికి ఆశ్చర్యపడుతూ...దొర్లుతూ...!

"బీ నెగటివ్ బ్లడ్ జర అర్జంటుగా కావాలి. ఎక్కడా దొరక లేదు సాబ్. ఎవరైనా దాతలు...." కన్నీటితో జనాంతికంగా కరీం!

"ఎవరికి?"

"సిస్టర్కి...ఆపరేషన్..."

చెయ్యి కడుక్కుని బాస్‌ని బ్రతిమాలి, మర్నాడెక్కువ సేపు చేసి పని పూర్తి చేస్తానని హామీ ఇచ్చి, కరీం మోపెడ్ మీద ఆసుపత్రికి.....

ఒక మతస్తుడి నుంచి మరో మతస్తురాలిలోకి రక్తం..... ప్రాణధార..... మానవబంధం.....!

'దేవుళ్ళా వచ్చావు" కాళ్ళ మీద పడబోతే ఆపాను.

"మామూలు మనిషిని..."

అప్పుడు చూశాను ప్రకాషిని. నన్నే గమనిస్తోంది. కనుబొమలు ముడివేసి ప్రశ్నించాను.

"ఇక్కడ జాబ్ చేస్తున్నాను..."

"గుడ్. ఓ జోక్ చెప్పనా? బీ నెగిటివ్ బ్లడ్ డొనేట్ చేసినందుకు నేనెంత పాజిటివ్వో అంటున్నారు వీళ్ళు.....!"

అభినందించాయామె చూపులు.

ఆ తర్వాతేం జరిగేదీ తెలుసు. ఆమె సమ్మోహనంగా నవ్వుతుంది. నాకు మైకం

కమ్ముతుంది. గబుక్కునామె పెదాల్ని చుంబించి ఆక్సిజన్ని లాగేసుకుంటాను. గొడవవుతుంది. సెన్సేషనల్ న్యూసవుతుంది. ఆపైన టీవీ ఛానళ్ళ వారికి పండగవుతుంది.!

అలా జరక్కూడదని తల తిప్పుకుని రెండడుగు లేశాను. తూలి పడ బోయాను. ఎవరో పట్టుకున్నారు.

"కాస్సేపు కూర్చోండి. చాలా వీక్‌గా వుంటుంది. బిస్కెట్లూ అరటి పళ్ళూ తినండి..."

సిస్టర్ మాటలు శిరసావహించి...మళ్ళీ రోడ్డు మీద పడ్డాను...

రెండు చక్రాలూ నాలుగు చక్రాలూ ప్రవాహంలా... లోకల్ రైల్వే ట్రాన్స్‌పోర్టు మీద శ్రద్ధ పెట్టి వుంటే పరిస్థితి 'జామ్' అయ్యేది కాదు. ఎవరు వింటారు! పొలిటీసియన్లూ అధికారులూ కాంట్రాక్టర్లూ కమీషన్లూ లంచాలూ....రింగుల గొలుసు.... స్విస్ బ్యాంకులకి తరలిపోతున్న లక్షల కోట్లు...!

వద్దొద్దు. డైవర్షన్ తీసుకో.....అదిగో పెద్ద హోర్డింగ్. పడుచుతార బికినీ ధరించి ఒంపు సొంపులు చూపిస్తోంది. ఊరిస్తోంది. నా వయస్సు వూరిపోయింది. ఆ సినిమా కెళ్తే? వంద సమర్పయామి...వద్దులే

ఏం చేద్దాం, ఎటు వెళ్దాం? ఆ సాయంత్రం–రాక్సీలో నార్మాషేరర్, బ్రాడ్వేలో కాంచన మాల – శ్రీశ్రీ సంధ్యా సమస్యే నాదీనూ. ఇంటికా ఫ్రెండింటికా హుస్సేన్ సాగర్‌కా లైబ్రరీకా? టైం పాస్‌కి ఏది బెస్ట్..... నీరసంగా వుంది. ఇల్లే బెస్టు. రెస్టే బెస్టు...

రెస్ట్... విశ్రాంతి... ఆ పదానికి మనిషి జీవితంలో సరైన చోటు లేక కుదించుకు పోతోంది. అన్నం తింటున్నా పడుకున్నా పనిచేస్తున్నా ఎవరో తరుముతున్నట్టు ఉద్విగ్నులై వూగిపోతూ టెన్షన్ క్రింద నలిగిపోతూ..... మాయ లేడిని కోరిన సీతల్లా పరుగులు... ఉరుకులు....నిశ్చితంగా బ్రతకటం భరోసాగా మాట్లాట్టం మరచిపోయి... ప్రక్కవాడితో మాట్లాడాలన్నా సెల్లే.....ఇంట్లోనూ ఇంతే. మాటల్ని మింగేస్తోంది టీవీ.... అన్నిట్నీ అందర్నీ కబళిస్తోన్న వ్యాపార సంస్కృతి....!

ఆ ధృతరాష్ట్ర కౌగిల్నుంచి మనిషి బయట పడాలి...ప్రవహించాలి..... ఉన్నదానికి తృప్తి పడుతూ బాంధవ్య బంధితుడై ప్రేమానురాగాల్లో తడిసి ముద్దవ్వాలి. మంచిగా మనిషిగా బ్రతకాలి. ధనాశలూ అవినీతులూ అసూయలూ అక్రమాలూ వక్ర బుద్ధులూ లేకుండా మాయా మార్మం లేకుండా ఆత్మీయంగా మసలితే ఎంత బావుణ్ణు!

మనిషికీ మనిషికీ మధ్య అడ్డుగోడలు కూలి, అనుబంధం పెరిగి, మనిషి మనిషిగా బ్రతికే రోజు, మనిషి మనీషిగా ఎదిగే రోజు అసలెప్పుడైనా ఎప్పటికైనా వస్తుందా? అశాంతి అవినీతి ఆరాటం పోరాటం కల్తీ కల్మషం లేని కాలం వస్తుందా? నిజంగానే మంచికాలం రహిస్తుందా? నిఝంగానే...?!

"రోడ్డు మీద తపస్సేంట్రా. రా బండెక్కు..."

ఉలిక్కిపడి చూశాను. కాముడు.

బైక్ ఎక్కి "ఎక్కడికి?" అడిగాను.

"బర్త్ డే పార్టీకి..."

"నేనొస్తే బాగోదేమో..."

"బాగు కోసమే. ఇదొక వంక మాత్రమే. గురుడు నా ఫైలు తొక్కి పెట్టాడు. డైమండ్ నెక్లెస్ కొన్నాను. అతగాడు తృప్తి పడితే సొమ్ము రిలీజవుతుంది. బతికిపోతాను" ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ కాముడి ఆరాటం! ఆశ!!

పిల్లాడి ఫంక్షను. తల్లికి గిఫ్టు. గురుడి మెప్పు. బిల్లు క్లియరు. చెయిన్ బావుంది.

బంజారా హిల్స్ రోడ్డూ బావుంది. ఒకప్పుడు కొండలూ బండలూ. ఇప్పుడు అంతస్తుల భవనాలూ షాపింగు మాల్సూ – నోట్ల కట్టల మీద కట్టినవే. ఇక్కడ ధన కనక వస్తు వాహనాలు పుష్కలంగా వున్నాయి. సుఖసంతోషాలు సంపూర్ణంగా అనుభవిస్తున్నారంటావా మైడియర్ గిరీశం? అనుమానమే. ఎంత చెట్టుకి అంతగాలి. ఎంత మనిషికి అంత అశాంతీ అభద్రతా నిరాశ!

పెద్ద హొటల్లో పార్టీ. రెండేళ్ల పిల్లాడి బర్త్‌డే... ఖరీదైన 'పెద్ద' మనుషులు. విలువైన బహుమతులు.... హిపోక్రసీ పలకరింపులు... సెల్లులో సొల్లు కబుర్లు... భారీగా ఆహార పదార్థాలు... మూడొంతులు వదిలేస్తున్న కడుపు నిండిన బేరాలు...!

ప్రయత్నించగా గురుడి దృష్టిలో పడ్డాడు కాముడు–కామేశ్వరరావు. ఆయన చూస్తుండగా గిఫ్టు ఇచ్చాడు.

అతగాడి 'అర్థాంగి' బాక్సు తెరచింది. డైమండ్స్ కాంతిపడి ఆమె కళ్ళు మెరిశాయి. ఆ మెరుపులు వక్రీకరణం చెంది కాముడి మోము వెలిగింది.

"పూజారిణి వరమిచ్చిందిరా" సంబరపడ్డాడు పూర్‌గై.

వాడి కడుపు నిండిపోయింది. దాంతో ఏమి తినకుండా బయట పడ్డాం.

కాముడు సిగరెట్టు తగలేస్తోంటే, "పబ్లిగ్గా తాగటం నేరంరా. నీకే కాదు మాకూ హానికరమనే కదా రాందాస్ నిషేదించిందీ!" అన్నాను.

"దీని మజా వాడికీ తెలీదు, నీకూ తెలీదు!"

ప్రక్కనో ఆకారం కదిలింది. చూశాను. కడుపు చూపిస్తూ చెయ్యి చాచింది శ్రీశ్రీ గారి భిక్షువర్షీయసి.

గబుక్కున లోపలికి దూసుకెళ్ళి ఓ ప్లేట్లో అన్నీ పెట్టుకునొచ్చి ఇచ్చాను.

ఆమె కళ్ళ నిండా నీళ్ళు.....!

"ఇదేం పిచ్చి పనిరా ? నువ్వు మారాల్రా. లేకపోతే బతకలేవు. మా అందరికన్నా ఎక్కువ సంపాదించాల్సిన వాడివి. ఇలా ఎదుగూ బొదుగూ లేకుండా ఎందుకుండిపోయావో ఇప్పుడర్థమవుతోంది. పెళ్లీ పెటాకుల్లేకుండా తెగిన గాలిపటంలా...."

క్లాసుపీకుతోంటే....."లీవిట్. పద..."

"నలుగుర్ని చూసైనా నేర్చుకో. నలుగురు నడచిన దారిలో నడువు..."

"హిపోక్రసీ నాతరం కాదు. నన్నిలా మిగిలిపోనీ"

" నీ ఖర్మ ! భావుకులు బ్రతక లేరు. స్వప్నం వేరు సత్యం వేరు. సర్దుకు పోతేనే సుఖం....."

"నేను పీల్చేది ఆక్సిజన్ని కాదు ఆశని..."

వాడు విన్పించుకున్నాడనుకోను.

డ్రాప్ చేసి వెళ్ళిపోయాడు.

కాళ్ళీడ్చుకుంటూ ఇంట్లోకి... దారిలో రెండ్రూపాయల సాంబారు కొని.....

పచ్చడి, సాంబారు, అన్నం... డిన్నర్ బావుంది. స్టార్ హొటల్ భోజనం దీని ముందు బలాదూర్..... నవల చేతుల్లోకి చూపులూ మెదడూ అక్షరాల్లోకి.....

తలుపు చప్పుడయ్యింది. అనుకోని అతిథి ఎవరో?!

ప్రకాషి...!

గుడ్లప్పగించాను.

"లోపలికి రానివ్వు మహానుభావా"

ఇహంలో పడి తత్తర పడుతూ బిత్తర చూపులు చూస్తూ "ఇంత రాత్రి వేళ నా రూం లోకి....."

"పోనీ మీ గుండె గది లోకి వస్తాను..."

విస్మితుడ్నై..... ప్రకాషి నన్ను నన్నుగా ఇష్టపడి...ఇది కథా? కలా?

"బీ పాజిటివ్ ...."

నవ్వింది-వెన్నెల చిలికి నట్టు.....

నా ఎద మీద సిరిమల్లెల వాన! నా ఎదుట ఉషః కాంతి !

"దేవుడూ నాకీ వరం చాలు!..."

* * *

**(శ్రీవేదగిరి కమ్యూనికేషన్స్ ప్రచురించిన**
**'అద్దం' కథానికా సంకలనం. జనవరి -2010)**